## దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 ( నమస్తే తెలంగాణ ): తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్(టీజీపీడబ్ల్యూ) తెలంగాణ ఫోర్ వీలర్ డ్రైవర్స్ అసోసియేషన్(టీజీఎఫ్‌డబ్ల్యూ డీఏ) ఆధ్వర్యంలో డ్రైవర్ల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్టు ఆ సంస్థ ఫౌండర్ షేక్ సలావుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి నుంచి పీజీ వరకు చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కనీసం 60 శాతం మార్కులు పొంది ఉండాలని,తల్లిదండ్రుల్లో ఒకరికీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని పేర్కొన్నారు. వార్షిక ఆదాయం మూడు లక్షల లోపు ఉండాలని తెలిపారు. విద్యార్థి ఫొటో, మెమో, ఇన్‌కం సర్టిఫికెట్, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ పెట్టి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 91776 24678, 6303525461 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## శివరాత్రికి ప్రత్యేక బస్సులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 ( నమస్తే తెలంగాణ ) : మహా శివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 25 నుంచి 28 వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు గ్రేటర్ హైదరాబాద్ ఇన్‌చార్జి ఈడీ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటననలో తెలిపారు. కీసరగుట్ట, ఏడుపాయల, బీరంగూడ జాతరలకు నగరం నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. కీసరగుట్టకు 285 బస్సులు, ఏడుపాయలకు 125, బీరంగూడకు 30 బస్సులు నడుపుతున్నట్టు పేర్కొన్నారు. సికింద్రాబాద్ రెంజిమెంటల్ బజార్, ఈసీఐఎల్ ఎక్స్ రోడ్, అమ్ముగూడ, ఉప్పల్ ఎక్స్ రోడ్ నుంచి కీసరగుట్టకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. సీబీఎస్ నుంచి ఏడుపాయలకు, పటాన్ చెరువు నుంచి బీరంగూడకు బస్సులు నడుస్తాయని తెలిపారు. వివరాల కోసం 9959226160, 9959226154 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## స్థాయి సంఘం ఎన్నిక ఏకగ్రీవమే!

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ ) : జీహెచ్ఎంసీ స్థాయి సంఘం ఎన్నిక ఏకగ్రీవమే కానుంది. ఏడాది కాల పరిమితితో ఉండే 15 మంది సభ్యుల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగుస్తున్న నేపథ్యంలో స్టాండింగ్ కమిటీ ఎన్నికకు షెడ్యూల్ ప్రకటించి ఈ నెల 10వ తేదీ నుంచి 17 వరకు నామినేషన్లను స్వీకరించారు. ఐతే 15 మందికిగానూ 17 మంది నామినేషన్లు వేయడం, ఇందులో ఎంఐఎం నుంచి 8 మంది, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్లు వేయగా..పరిశీలనలో అన్ని ఓకే అయినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు షెడ్యూల్‌లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల లోపు ఉపసంహరణ అవకాశం ఉండటంతో బీఆర్ఎస్ నామినేషన్ వేసిన ప్రసన్న లక్ష్మి తమ నామినేషన్‌ను గురువారం ఉపసంహరించుకున్నారు. నేడు కూకట్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ కూడా తమ నామినేషన్‌ను ఉపసంహరించుకుంటారని జీహెచ్ఎంసీ వర్గాలు తెలిపాయి. ఇదే జరిగితే ఎన్నిక లేకుండా ఏకగ్రీవం అయినట్లు అధికారులు ప్రకటించనున్నారు.

## యువ పురస్కానికి దరఖాస్తుల ఆహ్వానం

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 20: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ ప్రతి ఏటా మార్చి 27న ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ప్రదానం చేస్తున్న యువ పురస్కారానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జె.ఎల్ నరసింహారావు పేరు మీద ప్రదానం చేయనున్న ఈ పురస్కారానికి నాటక రంగంలో నటన, దర్శకత్వం, మేకప్, లైటింగ్, సెట్ తదితర సాంకేతిక అంశాలలో కృషి చేస్తున్న 35సంవత్సరాల లోపు యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, బాచుపల్లి చిరునామాకు పోస్టు ద్వారా , స్వయంగా గానీ సంబంధిత వివరాలతో మార్చి 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.


కలెక్టరేట్ ప్రాంగణంలో పడిగాపులుగాస్తున్న దరఖాస్తుదారులు


గృహ జ్యోతి, గృహలక్ష్మి సమస్యలపై దరఖాస్తు చేసేందుకు వచ్చిన ప్రజలు

# సర్కార్ తీరు.. ప్రజలు బేజార్

## సంక్షేమ పథకాల అమలులో ఆగమాగం

- రేషన్ కార్డుల దరఖాస్తుల్లో సమస్యలు
- ఇందిరమ్మ ఇండ్లు దరఖాస్తులకే పరిమితం
- గృహ జ్యోతితో కొందరికే లబ్ధి
- నిలిచిన గృహలక్ష్మి సబ్సిడీ
- కలెక్టరేట్ చుట్టూ ప్రజల పడిగాపులు

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వానికి స్పష్టత కొరవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడి 15 నెలలు కావొస్తున్నా పథకాల అమలులో పూర్తిగా వైఫల్యం చెందడమే కాకుండా సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నది. హైదరాబాద్‌లోని వేలాది మంది ప్రజలు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు ఒక్కొక్కరు ముడు నుంచి ఐదు సార్లు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు దరఖాస్తులు తీసుకోవడమే కాని.. వారికి ఎలాంటి రశీదులు ఇవ్వడం లేదు. అదేమిటని ప్రశ్నిస్తే.. తమకున్న అధికారం దరఖాస్తులు తీసుకోవడం వరకే అని చెప్పడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తమకు వస్తాయా? రావా? వస్తే ఎప్పుడిస్తారు? అనే ప్రశ్నలతో సతమతమవుతున్నారు. గృహజ్యోతి పేరుతో 2 00 యూనిట్ల కరెంట్ ఉచితమని ప్రకటించి కొంతమందికే వర్తింపజేసింది. గృహలక్ష్మి పేరిట రూ.500 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని.. మిగతా డబ్బు లబ్ధిదారుల ఖాతాలో వేస్తామని చెప్పారు. సబ్సిడీ డబ్బులు మూడు నెలలుగా రావడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పథకంలో ఏదో ఒక సమస్య ఉండటంతో జిరాక్స్ పేపర్లు పట్టుకుని ప్రజలు కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల అటు ప్రజలు.. ఇటు అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### నిరాశలో గృహ లక్ష్మి..

అధికారంలోకి రాగానే రూ.500 కే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం తీరు మూన్నాళ్ల ముచ్చటగా మారింది. గడిచిన మూడు నెలలుగా సబ్సిడీ డబ్బులు ఖాతాలో జమకావడం లేదని ప్రజలు నిట్టూరుస్తున్నారు. చేసేదేమీలేక గ్యాస్ బుక్కులు, ఆధార్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్‌లతో నగర ప్రజలు కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. సబ్సిడీ డబ్బులు రాకపోతే తామేమీ చేయలేమని అధికారులు చెబుతున్నారని వాపోతున్నారు. కాంగ్రెస్ నేతలు మాత్రం గృహలక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పుకుంటున్నారని ప్రజలు చెబుతున్నారు.

### వెలగని గృహ జ్యోతి..

పేద ప్రజలందరికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని కాంగ్రెస్ సర్కార్ చెప్పుకుంటున్నది. కానీ తమకు వందలాది రూపాయల కరెంట్ బిల్లు వస్తుందని ప్రజలు కలెక్టరేట్‌కు చేరుకుంటున్నారు. ఆధార్ కార్డులు, 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుతున్నట్లు రశీదులు తీసుకుని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తమకు ఉచిత విద్యుత్ పథకం వర్తించడంలేదంటే రకరకాల కారణాలు చెబుతున్నారని వాపోతున్నారు. తమ కంటే ఎక్కువ విద్యుత్ వాడేవారికి ఉచితంగా ఇస్తూ తమకు వందల్లో బిల్లులు వేస్తున్నారని వాపోతున్నారు.

### కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు..

ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు రశీదులు ఇవ్వకపోవడంతో మళ్లీ మళ్లీ దరఖాస్తులు చేసుకుంటున్నారు. ప్రతి సోమవారం ప్రజావాణికి వేలాదిగా తరలివస్తున్నారు. అది గాక మిగతా రోజుల్లోనూ అర్జిలు వస్తున్నాయని కలెక్టరేట్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం ప్రకటనలు చేయడం తప్ప ఇందిరమ్మ ఇండ్ల పంపిణీని ఆచరణలోకి తీసుకురావడం లేదని ప్రజలు వాపోతున్నారు. మరోవైపు అర్హులను గుర్తించకముందే ఇందిరమ్మ ఇండ్లు మొదలు పెట్టిన వారికి రూ.లక్ష అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.


దరఖాస్తుల స్వీకరణకు సమయం ముగియడంతో గేటు ఎదుట వేచిచూస్తున్న అర్జీదారులు

### రేషన్ కార్డులకు ఎన్నో చిక్కులు..

రేషన్ కార్డుల దరఖాస్తుల్లో విప్పలేనన్ని చిక్కుముడులున్నాయని అర్జి దారులు వాపోతున్నారు. గతంలో చేసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటం వల్ల కొత్తవాటిని మీసేవ ఆన్‌లైన్‌లో తీసుకోవడం లేదని అంటున్నారు. అప్పట్లో నవ దంపతులు చేసుకున్న దరఖాస్తులు ఇప్పటిదాకా వెబ్‌సైట్‌లో ఉండటంతో ఇటీవల పుట్టిన తమ పిల్లల పేర్లు నమోదు కావడంలేదని అంటున్నారు. కొత్తగా పెళ్లి చేసుకున్న మహిళల పేరు తమ పుట్టింటి రేషన్ దుకాణంలో తొలగించినా సివిల్ సప్లై సర్వర్‌లో తీసేయకపోవడంతో అత్తగారింటి రేషన్ కార్డులో నమోదు కావడంలేదంటున్నారు. ఒంటరి, భార్య చనిపోయిన పురుషుల రేషన్ కార్డులు దూరమవుతున్నాయని వాపోతున్నారు.

### రోజుకో ప్రకటనతో అవస్థలు..

ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలును తూతూ మంత్రంగా చేపడుతుండటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పథకాల రూపకల్పన, అమలుకు సంబంధించిన మార్గదర్శకాల్లో స్పష్టత లేకపోవడంతో అటు అధికారులు, ఇటు ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోజుకో ప్రకటన చేయడమే తప్ప.. ఆచరణలో చూపించకపోవడంతో ఇబ్బందులు ఎదురవతున్నాయి. ప్రజలు నిత్యం పనులు మానుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కలెక్టర్ హనుమంతరావు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 20 : మహిళ, రైతు రుణాలు, రాష్ట్ర కేంద్ర పథకాల రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని మినీ మీటింగ్ హాల్‌లో గురువారం బ్యాంకర్లతో నిర్వహించిన 2024-25 డిసెంబర్ త్రైమాసిక డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత, స్త్రీలకు ఉన్న ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించి వారి అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని బ్యాంక్ ప్రతినిధులకు సూచించారు. అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బ్యాంకు లింకేజ్ రుణాలు పెండింగ్ పెట్టకుండా మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల రుణాలను శీఘ్రంగా అందించాలని తెలిపారు. రుణాల మంజూరులో సమస్యలు ఎదురవుతున్న చోట వాటిని వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత బ్యాంకులదేనని చెప్పారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు ఈ ఏడాదిలో రూ.614 .31 కోట్ల రుణ లక్ష్యానికి రూ.523.15 కోట్లు, మెప్మా ఆధ్వర్యంలో రూ.88.14 కోట్ల రుణాలను మహిళకు అందజేసినట్లు తెలిపారు. జరిగిందన్నారు. పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి లబ్ధిదారులకు కిసాన్ క్రెడిట్ రుణాలు సకాలంలో ఇవ్వాలన్నారు. రిజర్వ్ బ్యాంకు అఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు జరిగే ఆర్థిక వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జడ్పీ సీఈఓ శోభారాణి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ, ఆర్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లక్ష్మిశ్రావ్య, నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వినయ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్‌సుందర్, జిల్లా పరిశ్రమల అధికారి రవీందర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.


రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

## రోడ్ల మరమ్మతులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 20 : నిత్యం వందలాది మంది ప్రయాణం చేసే రోడ్లను మరమ్మతులు చేసి ఇబ్బంది లేని ప్రయాణం కల్పించడంలో జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలం అయ్యారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్ అన్నారు. భువనగిరి నుంచి హనుమకొండ, జనగాం, తొర్రూర్ వెళ్లే రహదారి మాస్ కుంట వద్ద గుంతల మయమై అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రోడ్డుపై గుంతలను మట్టితో పూడ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్న ప్రభుత్వాలు కనీసం రోడ్డు మరమ్మతులు చేపట్టకుండా వదిలేస్తున్నారని, కండ్ల ముందే ప్రమాదాలు జరుగుతున్నా కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. గుంతల మయమైన రోడ్ల స్థానంలో నూతన బీటీ రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దయ్యాల మల్లేశ్, జిల్లా కమిటీ సభ్యుడు షేక్ రియాజ్, జిల్లా నాయకులు ఎండీ సా.ఇద్, ఎండీ సోహెల్, ప్రవీణ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## హార్ట్ థెరపీపై అవగాహన




సిటీ బ్యూరో, ఫిబ్రవరి20,(నమస్తే తెలంగాణ): క్యాన్సర్ చికిత్స మందులతో మాత్రమే పరిమితం కాకుండా వైద్యులు, రోగుల మధ్య ఏర్పడే అనుబంధంతో కూడా ముడిపడి ఉంటుందని స్టార్ ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్, మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సాయినాథ్ తెలిపారు. గురువారం నానక్‌రామ్‌గూడలోని స్టార్ ఆసుపత్రిలో క్యాన్సర్ రోగుల కోసం హార్ట్ థెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేవలం వ్యాధిని నయం చేయడమే గాకుండా రోగి మానసికంగా మారడం కూడా చికిత్సలో ఒక భాగమేనని తెలిపారు. స్టార్ హాస్పిటల్ డైరెక్టర్ డా. విపిన్ పాల్గొన్నారు.

## ఆడపిల్లల చదువుతోనే ఆర్థికాభివృద్ధి



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, ఫిబ్రవరి 20: ఆడపిల్లల చదువుతో కుటుంబం, దేశం ఆర్థిక అభివృద్ధిని సాధిస్తుందని విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ, బహదూర్ పల్లి లోని కేఎం పాండు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం హైదరాబాద్, మేడ్చల్ జిల్లా ల పరిధిలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న 337 మంది విద్యార్థులకు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ యాజమాన్యం ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున మొత్తం రూ.26.72 లక్షల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేయగా ఎమ్మెల్యే వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ జోనల్ హెడ్ షనీబ్, కూకట్‌పల్లి స్టోర్ మేనేజర్ మహమ్మద్ ఇర్ఫాన్, కేపీహెచ్‌బీ స్టోర్ మేజర్ శ్రీనివాస్, మార్కెటింగ్ హెడ్ రాకేశ్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయింట్ సెక్రెటరీ జ్యోత్స్నారాణి, కుత్బుల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ, ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ షేక్ మై మూన్, కాలేజ్ ప్రిన్సిపాల్ నాగేందర్రావు, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలదే గెలుపు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 20: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలదే గెలుపు అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీసీ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన డైరీని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో గురువారం సాయంత్రం బీసీ ఇంటలెక్చువల్ ఫోరం వ్యవస్థాపకులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుంకరి శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా బీసీలు అణచివేతకు గురవుతూనే ఉన్నారని, వారి ఓట్లతో గద్దెనెక్కిన అగ్ర వర్ణాలు వారిని మోసగిస్తూనే ఉన్నారన్నారు. బీసీలందరూ మేల్కొన్నారని, తమకు మద్దతుగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో కలిపి 90 శాతం బహుజనులు ఏకమయ్యారన్నారు. నల్గొండ, ఖమ్మం, వరంగల్‌తో పాటు కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ నియోజకవర్గాల్లో జరిగే మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేది బీసీ అభ్యర్థులేనని తెలిపారు. ప్రతి ఓటరు మొదటి, రెండు, మూడు, నాలుగు, చివరకు 40 వరకు ఉంటే మొదటి ప్రాధాన్యత ఓటు బీసీలకే వెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ టీచర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వీరప్ప, గోపాల కృష్ణ, విక్రమ్ గౌడ్, సింగం నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్, చిరంజీవులు, శ్రీనివాస్, గణేశ్ చారి

## సిరిపురం యాదయ్యకు ఘన నివాళి



యాదయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రమణ, యాదయ్య స్మారక సమితి సభ్యులు

ఉస్మానియా యూనివర్సిటీ: మలిదశ తెలంగాణ పోరాట అమరవీరుడు సిరిపురం యాదయ్య 15వ వర్ధంతిని ఓయూ ఎన్సీసీ గేట్ వద్ద గురువారం నిర్వహించారు. సిరిపురం యాదయ్య స్మారక సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ రమణ ముఖ్య అతిథిగా హాజరై యాదయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ధ్యేయంగా కొనసాగుతున్న ఉద్యమంలో సిరిపురం యాదయ్య ఆత్మార్పణ చేసుకొని ఉద్యమానికి మరింత ఊపిరి పోశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉస్మానియా యూనివర్సిటీ ఎన్సీసీ గేట్ వద్ద యాదయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్సీసీ గేట్ ను సిరిపురం యాదయ్య గేటుగా, ఆ మార్గాన్ని యాదయ్య మార్గంగా నామకరణం చేయాలని కోరారు. సిరిపురం యాదయ్య స్మారక సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థి పోరాటాలు మార్గదర్శకం కావాలి



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 20: బీజేపీ పాలనలో ప్రజలకు మేలు జరగదని ప్రొఫెసర్ జగన్ సింగ్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పూర్వ విప్లవ విద్యార్థులు 50 ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం రెండు రోజుల సదస్సు గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ జగన్ సింగ్ హాజరై మాట్లాడారు. దేశంలో దోపిడీ హింస దౌర్జన్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఇవి పోవాలంటే సమాజంలో విప్లవం రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రస్తుత సంక్షోభ కాలంలో మనుషులు మిగలడమే ఒక సవాలుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాడికల్స్ విద్యార్థులు తన విద్యార్థులని చెప్పేందుకు చాలా గర్వంగా ఉందన్నారు. 70, 80ల కాలం నాటి విద్యార్థి పోరాటాలు సమాజానికి మార్గదర్శకం కావాలని అన్నారు. ఈ సదస్సులో ఆర్ఎస్‌యూ నేత శివారెడ్డి, డాక్టర్ గోపీనాథ్, ప్రదీప్ ,మోహన్ రావు , ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే తదితరులు హాజరయ్యారు.

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

కవాడిగూడ, ఫిబ్రవరి 20: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సాదినేని వెంకటేశ్వరరావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 15 నెలలుగా పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాను ఇచ్చిన 6 గ్యారంటీలను, ఏడో గ్యారెంటీగా ఉన్న ప్రజాస్వామిక పాలన అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ లో వేలాది మంది ప్రజలతో ప్రజాప్రదర్శన నిర్వహించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ప్రారంభమైన ఈ ప్రజా ప్రదర్శన ఇందిరాపార్క్ వరకు సాగింది. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చలపతిరావు ప్రజా మహాధర్నాను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లక్షలాది మంది ప్రజలు పక్కా ఇండ్లు, రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, గోవర్ధన్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోటేశ్వర రావు, పీవోడబ్ల్యూ జాతీయ నాయకులు గాదె ఝాన్సీ, సంధ్య, ఐఎఫ్‌టీయూ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పీడీఎస్‌యూ నాయకుడు మహేశ్ పాల్గొన్నారు.




## సృజనాత్మక చిత్రలేఖనం అద్భుత కళ

సుల్తాన్ బజార్, ఫిబ్రవరి 20: వైవిధ్య భరితమైన బొమ్మలు గీయడం సృజనాత్మకమైన కళ.. వాస్తవ పరిస్థితులను అద్దం పడుతున్న కళా కృతులు ప్రజల్లో స్ఫూర్తిని, ప్రేరణ కల్గిస్తున్నాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. చిత్రకారుల ప్రతిభతో పాటు నైపుణ్యతను వెలికితీసేందుకు కళా ప్రదర్శనలు ఎంతగానో దోహద పడుతాయని తెలిపారు. గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో గాంధీసెంటనెరీ హాల్ వేదికగా హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో 84వ ఆల్ ఇండియా వార్షిక ఆర్ట్స్ ప్రదర్శనను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చిత్రలేఖన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన చిత్రకారులకు అవార్డులు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి ఆహుతులను స్వాగతించారు. అవార్డు ఉత్సవాల కన్వీనర్ సామల వేణు, ఎగ్జిబిషన్ సొసైటీ, ఉపాధ్యక్షులు, నిరంజన్, ప్రధాన కార్యదర్శి, సురేందర్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ ప్రభాస్ శంకర్, గంగాధర్, ఆదిత్య మార్గం,అశ్విని మార్గం ప్రతినిధులు పాల్గొన్నారు. ఆర్ట్ ఎగ్జిబిషన్, సావనీర్, గవర్నర్ ఆవిష్కరించి అందరికీ పంపిణీ చేశారు.


ప్రతిభ కనబరిచిన కళాకారులకు నగదు అవార్డులను అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ